ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి

- ప్రొద్దుటూరులో డీజేకు అనుమతి లేదు
- అశ్లీల నృత్యాల ప్రదర్శనలు ఏర్పాటు చేస్తే చర్యలు
- వినాయక ఉత్సవ కమిటీలతో ప్రొద్దుటూరు డీఎస్పీ భావన


మాట్లాడుతున్న ప్రొద్దుటూరు డీఎస్పీ భావన


మాట్లాడుతున్న మైదుకూరు డీఎస్పీ రాజేంద్ర ప్రసాద్

ప్రొద్దుటూరు క్రైం : నియోజవర్గంలోని ప్రజలు ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి పండుగ జరుపుకోవాలని ప్రొద్దుటూరు డీఎస్పీ భావన తెలిపారు. ఇందుకోసం సబ్‌డివిజన్ పోలీసులు అన్ని విధాలా సహకారాలు అందిస్తారన్నారు. వినాయక ఉత్సవ కమిటీలతో త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం పోలీసులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ప్రొద్దుటూరు నియోజకవర్గం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందన్నారు. ఇది చాలా హర్షించదగ్గ, సంతోషించవలసిన విషయమని తెలిపారు. ఎప్పటి లాగే ఈ సారి కూడా వినాయకచవితి ఉత్సవాలను సహృద్భావ వాతావరణంలో జరుపుకోవాలన్నదే తమ ఉద్దేశమని చెప్పారు. పోలీసుల అనుమతి లేనిదే వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయరాదన్నారు. ప్రజలకు, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేని చోట విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ ఉత్సవాలకు డీజే పర్మిషన్ లేదన్నారు. మైక్ పర్మిషన్ తీసుకున్నా తక్కువ సౌండ్ మాత్రమే పెట్టుకోవాలని తెలిపారు. రాత్రి 10 తర్వాత మైక్‌లు వాడరాదని చెప్పారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ సారి చిన్నపాటి ఘటనలు జరగకుండా రెవెన్యూ, ఫైర్ డిపార్టమెంట్‌ల సహకారంతో అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రొద్దుటూరు నియోజవర్గానికి సంబంధించి కామనూరు కుందూ బ్రిడ్జి వద్ద, రాజుపాళెం మండలంలోని వెల్లాల వంతెన వద్ద నిమజ్జన ఘాట్‌లను ఎంపిక చేసినట్లు చెప్పారు. ఇక్కడ విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని, అంబులెన్స్, రెస్క్యూ బృందాలను కూడా అందుబాటులో ఉంచుతామన్నారు. అలాగే భారీ విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్‌లను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనం కోసం వినాయక విగ్రహాలతో వచ్చే ట్రాక్టర్‌లలో మహిళలు, చిన్న పిల్లలు తీసుకెళ్లరాదని సూచించారు. ఊరేగింపు సమయంలో ఇతర కులాలు, మతాలకు వ్యతిరేకంగా నినాదాలు చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు రామకృష్ణారెడ్డి, సదాశివయ్య, వేణుగోపాల్, బాలమద్దిలేటి, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

మైదుకూరు : వినాయక చవితి పండుగను, నిమజనాన్ని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని మైదుకూరు డీఎస్పీ జి.రాజేంద్రప్రసాద్ సూచించారు. పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో మైదుకూరు పట్టణం, మండలంలోని గణేష్ ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ పండుగ సందర్భంగా మండపాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఎలాంటి రుసుం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. విగ్రహాల ఏర్పాటుకు అనుమతిని కోరుతూ ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పోలీసులు పరిశీలిస్తారని పేర్కొన్నారు. విగ్రహాలను ప్రతిష్ఠించిన మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉత్సవ కమిటీలు చూసుకోవాలని తెలిపారు. మండపాల వద్ద, నిమజ్జన సమయంలో డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో మైదుకూరు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి, ఎస్‌ఐ చిరంజీవి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారిశుధ్య పనుల పరిశీలన

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి పరిశీలించారు. శ్రీరాములపేట వీధిలో కాలువ నుంచి మురికి నీరు బయటికి వస్తుండటంతో చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. యాంటి లార్వా ఆపరేషన్ క్రమం తప్పకుండా చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బరాయుడుకు తెలిపారు. ప్రొద్దుటూరు ఛానల్-1లో ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్‌ను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్లు వినోద్‌కుమార్‌రెడ్డి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

సురవరం మృతి తీరని లోటు

బద్వేలు అర్బన్ : సీపీఐ అగ్రనేత సురవరం సుధాకర్‌రెడ్డి మృతి కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏ.బి.బర్ధన్‌నగర్‌లో సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, కె.సి.బాదుల్లా, బాలు, మునెయ్య, జిల్లా సమితి సభ్యులు ఇమ్మానియేల్, పి.వి.రమణ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకర్‌రెడ్డి మరణం వామపక్ష పార్టీలకు తీరని లోటు అని మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం విద్యార్థి దశ నుండి వామపక్ష భావాలు కలిగిన అఖిలభారత విద్యార్థి సమైక్య నుంచి ఆయన ప్రస్థానం మొదలైందని, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియాలో క్రమక్రమంగా ఎదుగుతూ రాష్ట్ర కార్యదర్శిగా, జాతీయ కార్యదర్శి స్థాయికి ఎదిగారన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్వరూప్ కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు వైవీ స్వరూప్‌కుమార్‌రెడ్డి, సాయి అఖిల్, కోటేశ్వరరావు విద్యార్థినులతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామసుబ్బమ్మ, కరస్పాండెంట్ బాబమ్మ, డైరెక్టర్లు నాగూర్, రవీంద్రారెడ్డి, శైలూష, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

బాలల సంరక్షణకు చర్యలు

ప్రొద్దుటూరు : బాలల సంరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఐసీపీఎస్ అధికారిణి సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మమ్మ, జమీలా తెలిపారు. స్థానిక జిన్నా రోడ్డులోని మున్సిపల్ ఉర్దూ హైస్కూల్‌లో శనివారం చైల్డ్ లైన్ 1098పై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డుపై దిక్కు లేని పిల్లలు తిరుగుతున్నా, అనాథ పిల్లలు, చెత్తకుండీలో ఎవరైనా వదిలేసిన పసిపాప కనిపించినా, బాల్య వివాహాలను జరుగుతున్నా వెంటనే 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

చాపాడు : చాపాడులోని నక్కలదిన్నె రోడ్డులో గల రెండు ఎరువుల దుకాణాలను శనివారం సాయంత్రం డిప్యూటీ తహసీల్దారు కృష్ణారెడ్డి తనిఖీ చేశారు. ఎరువులకు సంబంధించి రికార్డులను పరిశీలించి ప్రభుత్వ నిబంధనల మేరకూ ఎరువులను విక్రయించాలని హెచ్చరించారు.

సీఐలకు సత్కారం


బద్వేలు అర్బన్ సీఐను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

బద్వేలు అర్బన్ : ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బద్వేలు అర్బన్ సీఐ ఎస్.లింగప్ప, బద్వేలు రూరల్ సీఐ ఎన్.క్రిష్ణయ్యలను శనివారం ఆయా స్టేషన్లలో మున్సిపల్ చైర్మన్ వాకమళ్ళరాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు పుత్తాశ్రీరాములు, ఎస్.సుబ్బారెడ్డి, ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు ఎంఆర్ఎఫ్ రమణారెడ్డి, వివేక్‌రెడ్డి, రమణారెడ్డి, తిరుమలరెడ్డి, రఘురామిరెడ్డి, కృష్ణారెడ్డి, రంగారెడ్డి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఏజీపీగా శ్రీనివాసులు

కమలాపురం : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ (ఏజీపీ)గా సేవలందిస్తున్న బొలిశెట్టి శ్రీనివాసులును ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ కోర్టుకు, అలాగే జమ్మలమడుగు జూనియర్ సివిల్ కోర్టుకు ఇన్‌చార్జి ఏజీపీగా నియమిస్తూ కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాసులు కలెక్టర్‌తో పాటు లా డిపార్ట్‌మెంట్ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు

మైదుకూరు : వినియోగదారులు ఆదివారం కూడా విద్యుత్ బిల్లులను చెల్లించవచ్చని విద్యుత్ డివిజన్ అధికారి శ్రీకాంత్ తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలను తెరిచే ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకనే అక్రమ కేసులు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ


కాకాణి గోవర్ధన్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాజకీయంగా ఎదుర్కోలేకనే మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణిగోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మోపిన అక్రమ కేసులతో జైలుకు వెళ్లి ఇటీవల విడుదలైన కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను వేధించడం, అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారని అన్నారు. ఎన్ని అక్రమ కేసులు బనాయించినా భయపడే ప్రసక్తే లేదని, ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు కొనసాగిస్తూనే ఉంటామని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, బూత్ కన్వీనర్ల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపాలిటీ నాయకులు కేశవరెడ్డి, చెన్నకృష్ణారెడ్డి, కృష్ణారెడ్డి, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠాన్ని అభివృద్ధి చేస్తాం


బి.మఠంలో ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పుట్టా

బ్రహ్మంగారిమఠం : పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ తెలిపారు. శనివారం బి.మఠంలో అభివృద్ధి పనులపై అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మఠం అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. టూరిజం ఆధీనంలో ఉన్న భవనాలు తిరిగి భక్తులకు అందుబాటులోకి తెచ్చే విధంగా అధికారులు పరిశీలించారన్నారు. తక్షణం అభివృద్ధి పనులను ప్రారంభించాలని మఠం సిబ్బందిని, పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ కమిషనర్ రామచంద్ర మోహన్, కర్నూల్ డీసీ గురుప్రసాద్, ఏసీ మల్లికార్జున, ఈఓలు జగన్‌మోహన్‌రెడ్డి, జనార్దన్, బి.మఠం దేవస్థానం మేనేజర్ ఈశ్వరాచారి, మండల టీడీపీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, సింగల్‌విండో అధ్యక్షుడు సాంబ శివారెడ్డి పాల్గొన్నారు.

అధికారులంతా ఎమ్మెల్యే తనయుడి వెంటే


మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితో మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి

ప్రొద్దుటూరు : ప్రజాప్రతినిధి కాకపోయినా అధికార పార్టీ కావడంతో మున్సిపల్ అధికారులంతా ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తనయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి వెంటే నడిచారు. శనివారం సాయంత్రం మార్కెట్‌లోని సమస్యల గురించి చర్చించడంతోపాటు వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు నంద్యాల కొండారెడ్డి మార్కెట్‌కు వెళ్లారు. ఎస్ బాస్ అంటూ మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డితోపాటు ఇంజినీరింగ్ అధికారులు, ఇతర సిబ్బంది కొండారెడ్డి వెంట ఉన్నారు. మార్కెట్ సమస్యలపై చర్చించారు. ప్రజాప్రతినిధి కాకున్నా అధికారులందరూ ఎమ్మెల్యే తనయుడి వెంట నడవడం చర్చనీయాంశంగా మారింది. పలు సందర్భాల్లో కమిషనర్ ఛాంబర్‌కు వెళ్లి కొండా రెడ్డి చర్చిస్తున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


స్వచ్ఛతే లక్ష్యమని ప్రతిజ్ఞ చేస్తున్న వివిధ శాఖల అధికారులు

బద్వేలు అర్బన్ : పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని బద్వేలు ఆర్డీఓ ఎ.చంద్రమోహన్ పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం వివిధ శాఖల అధికారులు, హైస్కూల్ విద్యార్థులతో కలిసి స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డివిజనల్ అభివృద్ధి అధికారి వి.వి.శేషయ్య, తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డి, అర్బన్ సీఐ లింగప్ప, ఎక్సైజ్ సీఐ సీతారామిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మల్లేష్, ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ కుళాయప్ప, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శామ్యూల్‌డేవిడ్‌రాజ్, కమ్యూనిటీ హెల్త్ అధికారి ప్రియాంక పేర్కొన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కోఆర్డినేటర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, కళాశాల అధ్యాపకులు డాక్టర్ సులోచన, సబిత, శ్రీనివాసులు, పర్వీన్, ఈశ్వరయ్య, మల్లికార్జున, విద్యార్థులు పాల్గొన్నారు.

కాశినాయన : మండలంలోని బాలాయపల్లె ఎంపీపీ పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయుడు కాశీంవలి ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీంవలి మాట్లాడుతూ వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ నిర్మల, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉన్నత స్థాయికి ఎదగాలి


అనాథ పిల్లలతో ముచ్చటిస్తున్న బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ

పోరుమామిళ్ల : స్థానిక మదర్‌థెరెసా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలుర, బాలికల బ్లెస్డ్‌బ్రయాన్ అనాథ ఆశ్రమాలను శనివారం రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వై.జె.పద్మశ్రీ సందర్శించారు. అక్కడ ఉన్న అనాథ పిల్లలతో ముచ్చటించారు. వారికి అందుతున్న సౌకర్యాలు, విద్య గురించి విచారణ చేసి తల్లిదండ్రులు లేని మీరు మంచిగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆశీర్వదించారు. ఆశ్రమమంతా తిరిగి ఏవైనా లోటుపాట్లు ఉన్నాయేమో అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు, వసతి, భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేస్తూ కొన్ని మార్పులు చేర్పులను సూచించారు. మదర్‌థెరెసా ఫౌండేషన్ చైర్మన్ చిత్తారవిప్రకాష్‌రెడ్డి, ఓఎల్ఎఫ్ ప్రధానోపాధ్యాయురాలు ఆరోగ్యరాణి, మేనేజింగ్ ట్రస్టీ గిరిప్రణీత్‌రెడ్డి, పిల్లలకు వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ అమితారెడ్డిలను అనాథ విద్యార్థులకు సేవలందిస్తున్నందుకు అభినందించారు. రాత్రిపూట నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రొద్దుటూరు : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు వ్యవస్థాపకులు పూజ్య స్వామినీ శివదర్శనానంద సరస్వతీ మాతాజీ తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరంలో శివదర్శనానంద స్పిరిచ్యువల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు మొక్కలు అందించి నాటించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ పల్లేటి ప్రభాకర్‌రెడ్డి, కమిటీ కార్యదర్శి ఉదయగిరి రామచంద్రయ్య, ఉపకార్యదర్శి కుండా నాగరాజు, సభ్యులు జీవీ రాంగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు అర్బన్ : ప్రతిఒక్కరు మొక్కలు నాటడం బాధ్యతగా భావించాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుబ్బారెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.విజయకుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీచక్ర హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చక్రధర్‌రెడ్డి, గురుకుల పాఠశాల వైస్ ప్రిన్సిపల్ లతాదేవి, శారద, సీఐటీయూ పట్టణ కన్వీనర్ నాగేంద్రబాబు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని, పట్టణ అధ్యక్షుడు మస్తాన్‌షరీఫ్, ఉపాధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, యువరాజ్, ఖలీల్, సుధాకర్, ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు. స్థానిక బొల్లవరంలోని ఓం శాంతి భవన్‌లో, వైఎంఆర్ కాలనీలోని ఓం శాంతి భవన్ ఆధ్వర్యంలో సంస్థ ప్రథమ అధ్యక్షురాలు రాజయోగిని ప్రకాశమణి దాదీ పుణ్య తిథి విశ్వబంధుత్వ దినోత్సవం సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు హేమా బెహన్‌జీ, శివలక్ష్మీ బెహన్‌జీ, హిమబిందు, కృష్ణవేణి బెహన్‌జీలు, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర నాయకుడు తవ్వా సురేష్‌రెడ్డి, బ్యాంకు మేనేజరు సురేంద్ర, వికసితా ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి, భువనేశ్వరరెడ్డి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

■ స్థానిక విజయనగరం వీధిలోని ఓం శాంతి భవన్‌లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరంలో 85 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా శాంత బెహన్‌జీ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా అన్ని ఓం శాంతి భవన్‌లలో రక్తదాన శిబిరాలను నిర్వహించామన్నారు. కార్యక్రమంలో జీవన జ్యోతి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు గురుదేవ్ రామిరెడ్డి, టీడీపీ నాయకుడు గురివిరెడ్డి, సీనియర్ ఆడిటర్ మల్లిఖార్జునరెడ్డి, సీఏ కిరణ్, జగదీష్, శివకుమార్, భరత్‌కుమార్‌రెడ్డి, సుబ్బారావు, మహిళా న్యాయవాదులు గ్రీష్మా, స్నేహ భవాని, బ్యాంక్ అధికారులు, వేదవ్యాస డిగ్రీ కళాశాల, రాణితిరుమల దేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించాలి

చాపాడు : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన కరువు బత్యం, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏ.శ్యాంసుందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని అన్నవరం, మడూరు గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఏపీటీఎఫ్ సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజారెడ్డి, మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, జిల్లా కౌన్సిలర్లు అప్సర్ పాషా, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహం.. పర్యావరణ హితం

మైదుకూరు : పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత అని మైదుకూరు రూరల్ సీఐ శివశంకర్ పేర్కొన్నారు. శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పర్యావరణాన్ని కాపాడుదాం అనే పోస్టర్లను రూరల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రెబ్బా నరసింహులు, దినేష్, రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించాలని గోపవరం గ్రామపంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ కార్యాయలంలో శనివారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో 'మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుదాం' అనే పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలోడీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్, సీఐటీయూ నాయకుడు సాల్మన్, డీవైఎఫ్ఐ నాయకుడు తేజ పాల్గొన్నారు.

రహదారి నియమాలతో ప్రమాదాల నివారణ

ప్రొద్దుటూరు క్రైం : రహదారి నియమాలు పాటించడం వల్ల రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చని ట్రాఫిక్ సీఐ రాజగోపాల్ తెలిపారు. తద్వారా సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవచ్చన్నారు. కొర్రపాడు రోడ్డులోని ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కాలేజీలో శనివారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఎస్ఐ రాఘవేంద్రారెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

బద్వేలు అర్బన్ : ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటీలో నరసింహనాయుడు అనే విద్యార్థి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని అఖిలభారత విద్యార్థి అసోసియేషన్ జిల్లా నాయకులు బి.అనిల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని భగత్‌సింగ్ సర్కిల్‌లో ఏఐఎస్ఏ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

చీరలు, పంచెలు పంపిణీ

ప్రొద్దుటూరు : వినాయక చవితి పండుగ సందర్భంగా పట్టణంలోని యాచకులు, నిస్సహాయకులు, వృద్ధులకు ప్రాణదాత సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేసి, చీరలు, పంచెలు పంపిణీ చేశారు. శింగనమల వెంకటసుబ్బమ్మ, వెంకటసుబ్బయ్యల జ్ఞాపకార్థం వారి కుమారుడు వెంకటసుబ్బయ్య, కోడలు అశ్విని, మనువరాలు భవితశ్రీ, మనవడు దేవేంద్ర, కుటుంబ సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్, లాయర్ సుమంత్, నారాయణరెడ్డి, రాజు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

కాశినాయన : ఆయిల్ పామ్ పంట సాగు చేస్తే లాభదాయకంగా ఉంటుందని ఉద్యాన అధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. మండలంలోని కొండ్రాజుపల్లి రైతు సేవా కేంద్రంలో శనివారం ఆయిల్ పామ్ సాగు యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రవి, స్థానిక సర్పంచ్ శారదాదేవి, రైతు సేవా కేంద్రం సహాయకులు ఉమామహేశ్వరి, సువేన్ ఆగ్రో కంపెనీ ప్రతినిధి కొండారెడ్డి, డ్రిప్ ఏరియా అధికారి మహేష్, రైతులు పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి


ప్రత్యేక అలంకరణలో పంచముఖ ఆంజనేయస్వామి


రాజుపాళెం: ఉత్సవ మూర్తులకు పూజలు చేస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రావణ మాసం చివరి శనివారం సందర్భంగా పట్టణంలోని పలు ఆంజనేయ స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెన్నానది తీరంలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో విశేష పూజలు చేశారు. అలాగే పాతమార్కెట్‌లోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం, టూటౌన్ సమీపంలోని, బుడ్డాయపల్లెలోని, కొర్రపాడు రోడ్డు, రామేశ్వరం, మైదుకూరు రోడ్డులోని ఆంజనేయ స్వామి ఆలయాల్లో పూజలు చేశారు.

ఘనంగా అగస్త్యేశ్వరునికి భస్మార్చన

స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శనివారం అమావాస్య సందర్భంగా స్వామికి ఘనంగా భస్మార్చన నిర్వహించారు.

రాజుపాళెం : శ్రావణ మాసంలో చివరి శనివారం కావడంతో మండల పరిధి వెల్లాల పుణ్యక్షేత్రంలోని ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర, నరసింహ స్వాముల ఆలయాల్లో అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి విశేషంగా అలంకరించారు. అలాగే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ, సంజీవరాయ స్వాముల ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనులను చేసి ఆలయ ఆవరణలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాస పూజలు శనివారం అమావాస్య సందర్భంగా వైభవంగా అభిషేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.